
# జానపద గేయాలు

జానపదుల సుఖం నుంచి, దుఃఖం నుంచి ఇతర భావావేశాల నుంచి జానపదగేయాలు ఆశువుగా పుట్టుకొచ్చినవేగానీ ఏ ఒక్కరు సృష్టించినవి కావు. పాటలు, పదాలు, కీర్తనలు, తత్వాలు, దరువులు, జావళీలు, జోలపాటలు, లాలిపాటలు యింకా గనేకమయిన ప్రక్రియలు మన జానపద కళాస్రవంతిలో వెల్లివిరిసాయి.

జానపద వాఙ్మయం, జానపదకళలపై పరిశోధనల్లో తనజీవితాన్ని ధారపోసిన వారిలో శ్రీనేదునూరి గంగాధరంగారు అగ్రగణ్యులు. వీరు వేమన పద్యాలు 5010 వరకూ సేకరించి ప్రచురించారు. జానపదవ్యాసుడిగా పెద్దల ప్రశంసలు పొందారు. వీరిని ఆంధ్రవాఙ్మయ సరస్వతి అని ప్రస్తుతించేవారు. వీరు జానపదకవిత గురించి "మలమల మాడ్చే ఎండలు హోరున కురిసే వర్షాలు, ముడుచుకుపోయేచలి, ఆనందంలో ఉర్రూతలూగించే పంటపొలాలు, కష్టమైన పనులు, చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు, పేరంటాళ్ళు, పండగలు, పబ్బాలు, పూజలు ఒకటేమిటి ప్రతిసంఘటన, ప్రతి సన్నివేశము పల్లెటూరివారి కవితావేశానికి మూలకందాలవుతో వచ్చాయి." అని అన్నారు.



జానపద సాహిత్యానికి లయ ప్రధానమయ్యింది దరువు ఆలంబనఅయ్యింది. యిక్కడ భావానికి ప్రధాన్యతే ఉందిగాని భాషకు కాదు. వారికి తెలిసింది మాట్లాడుకునే భాష. ఆనంద విషాదానుభూతులతో వారిమాటలే పాటలయ్యాయి. ఆపాటలే జనజీవితాన్ని కదిలించాయి.

మనిషి పుట్టుక దగ్గర్నుండి చావు వరకు మనిషి జీవితంలో సంభవించే అనేక అనుభూతులు జానపద సాహిత్యంలో చోటు చేసుకొన్నాయి. చంటి పిల్లల్ని నిద్ర పుచ్చుటానికి ఉయ్యాల ఊపుతారు.

"జో అచ్చుతానంద జోజోముకుందా"

"రామాలాలీ మేఘ శ్యామాలాలి"

అలాగే చంటి పిల్లలకు ఉగ్గు పట్టేటప్పడు

"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం"

అనే పాటలు. పిల్లలు ఆడుకునే పాటలు

కాళ్ళా గజ్జ కంకాళమ్మ

వేముల చెక్క వెలగా మొగ్గ

"చెమ్మ చెక్క చారడేసిమొగ్గ

అట్లుపోయింగ ఆరగించంగ"

అలాగే మేలు కోలుపు పాటలు

"తెల్లవారవచ్చె తెలియికనా స్వామి

మళ్ళీ పరున్నావు లేరా.........

"శివ శివమూర్తి గణనాధ" అనే

కోలాటపుపాటలు :

"భామామణివో తలుపుతేయవే భామ"

అనే తలపుదగ్గర పాటలు

యింకా ఎన్నో ఎన్నెనో జానపదగీతాల

సంపదకు కొదవలేదు

సామెతలు, నీతిదాయక మైన విషయాలు :

"అరవై పిండివంటలు ఆవు పాదుగులో ఉన్నవి"

"తల్లిని నమ్మినవాడు, ధరణిని నమ్మినవాడు చెడడు."

"అడ్డాలనాడు బిడ్డలుగాని, గడ్డాలనాడు బిడ్డలా"

పెళ్ళి అయిన తర్వాత తమ కూతురు అత్తవారింట్లో యేవిధంగా మసలుకోవాలో తెలిపే అప్పగింతలపాటలు. అత్తమీద కోడల, కోడలు మీద అత్త ఆడిపోసుకునే పాటలు

" అత్త లేని కోడలుత్తమురాలు

కోడలు లేనత్త గుణవంతురాలు"

యింకా యెన్నో యెన్నెన్నో ఉన్నాయి.

యివే కాక వైద్య శాస్త్రానికి సంబంధించిన పాటలు యెన్నో ఉన్నాయి. జ్యోతిష శాస్త్ర సంబంధించిన అంశాలు కూడా జానపద పాటల లో చోటు చేసుకున్నాయి.

" పెద్దవాడు, సినవాడు

మామతో గూడెనేని

వంచనింత లేకుంట ! వానవచ్చును :

పెద్దవాడు అనగా సూర్యడు చినవాడు అనగా బుధుడు మామ అనగా చంద్రుండున్న రాశిలో ఉంటే తప్పక వర్షం వస్తుంది.

జానపదులకు వ్యవసాయం ముఖ్యమైన వృత్తి అవటం వల్ల ఏరువాక పాటలు, భూమిదున్నేటప్పడు, నాట్టేసేటప్పడు, కోతలు కోసేటప్పడు పాడే పాటలు లెక్కలేనన్ని. యిప్పటికి వ్యవసాయ కూలీలు తమ శ్రమను మరచిపోవడానికి ఈ పాటలు పాడుతూ పొలాల్లో పని చేస్తుంటారు.

అలాగే ఏదైన బరువులు ఎత్తేటప్పడు కార్మికులు పాడుకునే పాటలు కూడా ఉన్నాయి. ఈ పాటలు పట్టణాల్లో కూడా విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టటం వంటి బరువు పనులు చేసేటప్పడు శ్రమ తెలియకుండా ఉండేందుకు పాడుతుంటారు. ఈ పాటల్లో శృంగారం మోతాదు ఎక్కువగా ఉంటుంది.

అలాగే వీరగాధలు, ఉదాహరణకు కాటమరాజు కథ, శ్రీనాథులవారు వ్రాసిన పల్నాటివీర చరిత్ర, కరుణరసంలో కామమ్మకథ, సన్యాసమ్మకథ మొదలయినవి. తత్వాలు, కీర్తనలు, శృంగార గేయాలు, నోముల పాటలు, పారమార్థిక గేయాలు లెన్నో ఉన్నాయి.

మన అదృష్టం కొద్దీ యిప్పటికి ప్రతి యింట పాడుకునేవి మంగళహారతులు. గ్రామాలలో గొబ్బి పాటలు. అలాగే అట్ల తద్దె ఆటలేని పల్లె లేదు.

ముఖ్యంగా ఈ గేయాలకు స్త్రీలు కాపాడుకొనుచున్నారు. జానపదగీతాలన్నీ ముఖతః వచ్చినవే. ఏవీ గ్రంథస్తం కాలేదు. జానపదులే ఈ గేయాన్ని ఒకరినుంచి ఒకరు అందిపుచ్చుకొని కాపాడు కుంటున్నారు.

మన జానపద వాఙ్మయాన్ని ఎంతో శ్రమకోర్చి, సేకరించి పరిశోధించిన వారిలో శ్రీనేదునూరి గంగాధరం గారు అగ్రగుణ్యులు. ఇంకా సర్వశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి, చిలుకూరి నారాయణ రావు, చింతాదీక్షితులు, సురవరం ప్రతాపరెడ్డి, అడవి బాపిరాజు, ఉన్నవ లక్ష్మీనారాయణ, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, గిడుగురామ్మూర్తి, డాక్టర శ్రీపాద లక్ష్మీనారయణ, ఆచార్య బిరుదురాజు రామరాజు ఆచార్య శ్రీమతి నాయని కృష్ణకుమారి, ఆచార్య యస్.వి.జోగారవు యింకా యెందరో ప్రముఖులున్నారు.

జానపద గేయాలు పాడటంలో అనేక మంది కళాకారులున్నారు. వారు వారి ప్రతిభతో మన రాష్ట్రం లోనే కాక విదేశాల్లో కూడా ప్రదర్శన లిచ్చి మన జానపద గేయాలకు విదేశాలలో కూడా మంచి గుర్తింపు వచ్చేలా చేయుచున్నారు.